


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### జీవితమే రుచి భరితం

**మీ జీవితంలో మీరు తిన్న** మంచి భోజనం ఏవిటి? అని మిమ్మల్ని ఎవరైనా అడిగితే ఏం చెప్తారూ? నాకైతే రాజుగారికి పేదరాశి పెద్దమ్మ గరిక పచ్చడి చేసి పెట్టి పరగణా ఈనాంగా పొందిన కథ గుర్తొస్తోంది. ఆకలితో దారి తప్పి వచ్చిన రాజుకి వేడి వేడి అన్నం అరిటాకులో పెట్టి, గడ్డి పచ్చడి చేసి పెట్టిందట పేదరాశి పెద్దమ్మ. ఆవురావురు మని తిన్న రాజుగారికి, తన రాజభవనపు పంచభక్ష పరమాన్నాలు దీని ముందు బలాదూర్ అనిపించిందట. అంటే ఇక్కడ రుచికన్నా ఆకలి ముఖ్యం.. ఆకలి రుచెరగదు. నిద్రసుఖం ఎరగదు. గరకు నేలమీద గురకలు పెట్టి నిద్రపోతుంటారు కష్టజీవులు. ఇలా రుచిగా తిన్న అనుభవాలు అందరికీ ఉంటాయి.

ఒకరోజు నేను మా అత్తగారి ఇంట్లో సాయంకాలం పూట 'ఏమన్నా తినాలని' ఆకలేసి , ఈ 'ఏమన్నా...' అలవాటు ఇప్పటికీ ఉంది. పచ్చబఠానీలూ, కొన్ని శనగలూ నానపెట్టినవి పోపులో వేసి, కొద్దిగా కొబ్బరికోరు జల్లి, రవ్వంత చింతపండు పులుసు వేసి, పైన కొత్తిమీర జల్లుతుడగా అలిమేలు అనే ఎదురింటి అమ్మాయి, వాళ్ళ అమ్మ తాళం చెవులు ఇచ్చిందా అని అడగడానికొచ్చింది.

"ఇచ్చారు. కొద్దిగా ఇవి నోట్లో వేసుకుని వెళ్ళు" అని ఆ గుగ్గిళ్ళు పెట్టి మంచి నీళ్ళిచ్చాను.

ఆ ఆలివేలు అనే అమ్మాయి రెండు బస్సులు మారి. కాలేజీనుండి ఎంత ఆకలితో వచ్చిందోగానీ "ఎంత బావున్నాయి వదినా?" అని ఇంకొంచెం అడిగి తింది.

ఇది జరిగిన రెండేళ్ళకి, ఆ అమ్మాయి పెళ్ళయి నెల తప్పింది. కడుపుతోటి వున్న ఆ అమ్మాయి వాళ్ళ అమ్మతో "అమ్మమ్మగారి కోడలు చేసినలాంటి సాతాళించిన శెనగలు తినాలనుంది" అని కోరిందట.

వాళ్ళమ్మ "అదేం మహాభాగ్యం?" అని శనగలు నానపోసి చేసి పెట్టిందట.

"అబ్బే ఇలాకాదు ఆ రుచి అమోఘం" అందట ఆ అమ్మాయి.

ఆ విషయం నాకు మా అత్తగారొచ్చి చెప్తే నవ్వుకున్నాను. ఎందుకంటే, నేను చేసిందేమీలేదు. ఆ రోజు ఆ అమ్మాయి అంత ఆకలిమీద వుందేమో అనిపించి.

నాకూ ఇటువంటి అనుభవమే ఒకటుంది. మా అత్తగారి ఇంటిపక్కన చిట్టెత్తయ్య అనే ఆవిడ, సరిగ్గా నాలుగంటే నాలుగు మినపగారెలు, నేను ఏడో నేల కడుపుతో వున్నప్పుడు తెచ్చి పెట్టింది. అవి మెత్తగా గారెలలా లేవు. అరచెయ్యి అంత ప్రమాణంలో కరకరలాడుతూ, మిరియం ఘాటు తగులుతూ ఎంత బావున్నాయో చెప్పలేను.

అత్తగారిల్లు కదా. నాలుగూ నేనే తింటే బావుండదని, రెండు తిన్నాను. ఆ తర్వాత మా అత్తగారితో 'చిట్టెత్తయ్యగారెలు' చేసుకుందామా అంటే పాపం ఆవిడ చేసి పెట్టారు. ఉహూ! అస్సలు ఆ రుచికి ఆమడ దూరం కూడా రాలేదు. ఈరోజుకీ ఆ రుచికి దరిదాపుల కొచ్చే గారెలు నేను తినలేదు. ఈ మధ్య తాడి బందు ఆంజనేయుడి గుడిలో వడమాల వేయిస్తే, కొద్దిగా ఆ మోస్తరు గారెలు దండగుచ్చి, స్వామికి వేసి తర్వాత మనకి ఇస్తున్నారు. ఇంక ప్రసాదాల విషయానికొస్తే, గోవిందరాజుల స్వామి తిరుపతి గుడిలో, దద్దోజనం గరిటెతో మన అరచేతిలో వేస్తే, అరచెయ్యి అంతా జిడ్డుగా... నోట్లో పెట్టుకోగానే నాడీ మండలం అంతా చేతనత్వం కలిసి స్పందించి, రాతి స్థంభాలకే చేతనత్వం కలిగి సరిగమా పదనిసా అని స్వరములే పాడగా...' అన్నట్టు అయ్యేది. అంత చిక్కదనం ఆ పెరుగుకి ఎందుకొచ్చేది అంటే.. తర్వాత తెలిసింది. పెరుగులో అన్నం వార్చిన గంజికూడా కలిపి, నేతి తిరగమోతపెడ్తారని. ఆ గోవిందరాజుల దద్ధోజనం తినని జన్మ వ్యర్థం కదా అనుకుంటూ, చివరిగా మేం తిరుపతి వెళ్ళినప్పుడు క్యూలో కదుల్తుంటే, ఆ రోజు చక్కెర పొంగలి పెడ్తున్నారు. "అన్యాయం స్వామీ.. నేను అంత దూరం నుండి వచ్చేదీ దద్దోజనం కోసంగా..' అనుకున్నాను మనసులో, నాదాకా వచ్చేసరికి చక్కెర పొంగలి బుట్ట అయిపోయిందని, వెనక్కి నెట్టేసి దద్దోజనం బుట్ట ముందుకి నెట్టి నా చేతిలో గరిటతో వడ్డించగానే ఆ రుచి చూసి 'స్వామీ మేమెంత నీకోసం ఎదురు చూస్తామో. నువ్వూ మా కోసం అంతే ఎదురుచూస్తావు కదూ!' అనుకున్నాను.

షిరిడీలో ఒక భక్తుడు 'సాంజా' రుచి చూసి 'ఈ రోజు ఎంత కమ్మగా వుందీ' అనుకున్నాడట. మళ్ళీసారి వెళ్ళినప్పుడు బాబా రెండు ముంతలనిండా 'సాంజా' తెప్పించి 'నీకిష్టం కదా పూర్తిగా తిను' అన్నారని పారాయణలో చదివాను 'సాంజా' అంటే రవ్వతో చేసిన ఉప్మాలాటి ద్రావకం.

నేను ఈ కాలమ్ రాస్తుండగా, కో ఇన్సిడెన్స్ గురువుగారు సింగీతం శ్రీనివాసరావు గారు ఫోన్ చేసి "మీ ఇంట్లో భోజనం బావుంటుందని అందరూ చెప్తారు. ఈసారి హైద్రాబాద్ వస్తే నీ చేతివంట తినాలమ్మా" అన్నారు.

అది ఒక ఆశీర్వాదంగా భావించాను. త్వరలో ఆ మంచి రోజు రావాలి.

మా మల్లాది వెంకట కృష్ణమూర్తిగారి శ్రీమతి, పద్మజ "ఇష్టమైన వాళ్ళకి వండిపెట్టడం శ్రమ అనిపించదు రమణీ" అంటారు. నిజంగా నిజం .. నాకూ అంతే. కొంతమంది కోసం వంట చేస్తుంటే చాలా ఆనందం కలుగుతుంది. మన భావప్రకటనకి వంట ఒక మార్గం. విమల్ ఎడ్వర్టైజ్‌మెంట్‌కి 'స్త్రీ మనోభావాలకి రూపాలు ఎన్నో ' అని వేసేవారు.

నాకు చాలా చిన్నప్పుడు, నాన్న మిర్యాలగూడాలో అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్‌లో పని చేసేవారు. ఊరు చివర తడికలతో నాలుగైదు, పెద్ద పెద్ద గదులున్న క్వార్టర్స్ ఇచ్చేవారు. ఒక గది మేం స్నానాల గది చేసుకుని, నేనూ, అమ్మా నాలుగురోజులుండి వచ్చేస్తుండేవాళ్ళం. అలా ఒసారి నేనూ అమ్మా వెళ్ళేసరికి నాన్నలేరు. తాళం చెవి కూడా పక్క వాళ్ళకి ఇవ్వలేదు. నల్గొండ వెళ్ళారట సినిమా చూడటానికి. పక్కింట్లో రాజులావిడ మమ్మల్ని పిలిచి కూర్చోమని మాట్లాడ్తూ, "చాలా ఆలస్యం అయింది, మీరు మా ఇంట్లో భోంచేస్తారో లేదో. పిల్లకైనా పెట్టండి" అంది.

అమ్మ నావైపు చూసేసరికి 'తింటా' అన్నాను.

అప్పుడు ఆవిడ వెండిగిన్నెలో వేడి వేడి అన్నం, ఆవకాయా, పక్కన ప్లేట్‌లో వెన్నపూసా తెచ్చి పెట్టింది. అమ్మ కలిపి పెడ్తుంటే తిన్న ఆ ఆవకాయ రుచి మళ్ళీ నాకు జన్మలో దొరకలేదు అనుకోండీ. తర్వాత గెడ్డ పెరుగు కూడా వేసారావిడ. మొహమాట పెట్టి అమ్మకి కూడా అన్నం పెట్టారు. ఎంత గుర్తుండిపోయిందో ఆ భోజనం.

ఒక రోజున నాకు మనసు బాగోలేదు. అమ్మని తీసుకుని చిలుకూరు వెళ్ళాను. చేవెళ్ళ దాటాకా "ఇక్కడ అనంత పద్మనాభస్వామి గుడివుందిట. వెళ్దామా?" అన్నాను. అమ్మ సరేనంది .నా ట్రావెల్ కంపేనియన్ అమ్మే. ఆవిడతో వెళ్తే ఎంజాయ్ చేసినట్లు ఇంకెవరితో చెయ్యలేను. బాగా మధ్యాహ్నం అయిపోయింది. గుడి మూసేస్తుండగా నేనూ, అమ్మా డ్రైవర్ నరసింగ్ దర్శనం చేసుకున్నాం.

పూజారిగారు గుడికి తాళం పెట్టి పక్కనే వున్న తన ఇంట్లోకి వెళ్తున్నారు. సాంబారు మరుగుతున్న వాసన వస్తోంది. నాలో జఠరాగ్ని రేగింది. ఆకలి తీర్చడానికి చుట్టుపక్కల హోటల్స్ కూడా లేవు.

"స్వామీ.. భోజనం ఏమైనా దొరుకుతుందా?" అని అడిగాను.

ఆయన ఓ నిమిషం మావైపు చూసి "రండమ్మా.. ఐదు నిమిషాలు కూర్చోండి. మంచి నీళ్ళు తాగండి" అని ఒక అమ్మాయి కోడలులా వుంది, పిలిచి కన్నడంలో వీళ్ళకి భోజనం పెట్టు అని చెప్పారు.

నేను సందేహిస్తూనే "మరి మా డ్రైవర్?" అన్నాను.

"అతనికీ వుందమ్మా ఆకలి అందరికీ ఒకటే" అన్నారాయన.

రెండు చేతులెత్తి నమస్కరించాను.

ఆకులు పరిచి కోసం బీర్, వంకాయ పప్పు, చింతకాయలు పచ్చిమిరపకాయలూ, కొత్తిమీరా మాత్రమే వేసి నూరిన పచ్చడి, ఘుమఘుమలాడే చారూ, ఇదీ వాళ్ళు చేసిన వడ్డన. ఆ రుచి అమోఘం. ఆయన భార్య మడితో వచ్చి, మా డ్రైవర్‌కి

కూడా మా సహపంక్తిన వడ్డించి కొసరి కొసరి తినిపించారు. ఈ పై సంఘటనల బట్టి ఆకలితో వున్న వారిలో పరమాత్మని చూసిన వారే నిజంగా దైవాన్ని నమ్మేవారు అని తెలుసుకోవాలి. మేం తర్వాత దక్షిణ యిస్తే వద్దంటే వద్దన్నారు. మేమే అక్కడ హుండీ వుంటే వేసి దణ్ణం పెట్టి వచ్చాం.

నిన్న నేను సిట్టింగ్‌కి వెళ్తూ, అక్కడ మా మేనల్లుడు వుంటాడని (తనే నా ప్రొడ్యూసర్) లంచ్ ఇద్దరికి అని ప్యాక్ చేసుకున్నాను. పాలకూర పప్పూ, ఆకాకరకాయ వేపుడూ, నిమ్మకాయ ఊరగాయ. కొత్తగా అమెరికా నుండి తెచ్చుకున్న హాట్ పాక్ అని మురిసిపోతూ బయల్దేరాను.

మా ఇంటినుండి ఏ.ఓ.సీ సర్కిల్ దాగా వెళ్ళగానే ఒక ముసలావిడ, తన కొంగు పరిచి యాచిస్తూ కారుకి అడ్డుపడింది. నేను డ్రైవర్ని ఆపమని, ఆమెకి పర్స్‌లో వున్న నోట్లు లెక్కపెట్టి నలభై రూపాయిలు ఇచ్చాను.

"వద్దమ్మా అన్నం పెట్టు. అన్నం తిని రెండురోజులయింది. కళ్ళు తిరుగుతున్నాయి.." అంది.

వెంటనా ఐడియా రాలేదు. ఇంకా డబ్బులు ఇవ్వబోయాను. ఆమె మళ్ళీ "అన్నం పెట్టమ్మా" అంది.

అప్పుడు "ఆగు.." అని, పండ్ల ముక్కలతో వున్న ప్లాస్టిక్ డబ్బా ఖాళీచేసి, అందులో అన్నం, ఆధరువులూ పెట్టి ఇచ్చాను. ఆమె ఆనందంగా డబ్బా తీసుకుని వెళ్ళిపోయింది. ఎంతోసేపు ఆలోచించాను. ఆమెకి నా దగ్గర అన్నం వుందని ఎలా తెలుసు?

అన్నంకోసం ఎందుకు పట్టు పట్టింది? అని... అంతా భగవన్మాయ. ఏ రూపంలో అయినా భగవంతుడొచ్చి మనని అన్నం అడుగుతాడు.

ఇంకొక సంఘటన, నిన్న ఇంటిముందుకి వచ్చి ఆవు 'అంబా' అని అరిస్తే, బాల్కనీలో నుండి అరిటి పండు వేసాను. కాలితో తొక్కేసిపో యింది. ఎవరో పిల్లాడ్ని స్కూల్‌కి తీసుకెళ్తున్న ఆవిడతో "అది కాస్త దాని నోటికి అందించండి" అన్నాను. ఆమె అలాగే చేసింది. ఆవు చిన్నపిల్లాడు మంకుతనం చేసినట్లు, తల అడ్డంగా వూపి, 'తినను' అన్నట్లు, గడ్డిమేస్తూ వెళ్ళిపోయింది. ఆమె నేను కూడా నిర్ఘాంతపోయాం.

మర్నాడు కిందకి దిగి వెళ్ళి పెడితే తింది.

"ఫేకే హువా పైసా వుఠాయేంగే, నై" అన్న అమితాబ్ బచ్చన్ డైలాగ్ గుర్తొచ్చి నవ్వుకున్నాను.

పోయిన సంవత్సరం మా చిన్న అబ్బాయి క్రిష్ణ పెళ్ళి, గగన్‌కౌర్ తో సియాటిల్‌లో చేసాం. ఆ పెళ్ళికి కౌముది ఎడిటర్ కిరణ్ ప్రభగారూ, వారి సతీమణి కాంతికిరణ్‌కూడా వచ్చారు. ముందురోజు హల్దీ రోజున మాకు భోజనం పెడ్తూ మా వియ్యపురాలు కాకరకాయ స్టఫ్డ్ కర్రీ వేసింది. ఆ రుచి మా రమక్కకీ, మా కాంతిగారికీ ఎంత నచ్చిపోయిందో. వాళ్ళు 'సిక్కులు'. నాకు గురుద్వారలో పెట్టే లంగర్ దాల్ అంటే చాలా ఇష్టం. ఇంక మా వియ్యపురాలు నిర్మల్ చోలే బతూరా

అయితే చాలా బాగా చేస్తుంది .మా వారికి తను చేసే ఆలూ పరోటాలు కళాత్మకంగా ఉంటాయిట. ఏ భాష అయినా ఏ ప్రాంతం అయినా వంట మనసు పెట్టి చేస్తే అది కళే.

మా అమ్మకి రాజహంసగారనే ఫ్రెండ్ ఉన్నారు. ఆవిడ ఇంట్లోకి అడుగుపెట్టేనే ఆ డెకార్‌కీ, శుచికీ శుభ్రతకీ మనసు ఆనంద తరంగం అవుతుంది. ఇంక వారింట్లో ఒకరోజు భోజనానికి పిలిచారు. ఆ ఆవకాయ అయితే ఇప్పుడే వేసిన కొత్త ఆవకాయలా వుంది. ఆవిడ ఎలా వాటిని చిన్న చిన్న పాకెట్లుగా డీప్ ఫ్రీజర్‌లో స్టోర్ చేస్తారో చూపించారు. బిసీబెళాబాత్ అయితే.. ఇంక అంతటి రుచి మళ్ళీ ఎప్పుడూ తినలేను అని గట్టిగా అనిపించింది. ఆవిడ ఏం చేసినా అంతే బాగా చేస్తారు. కాజూ కత్లీ, బాదుషాలాంటి స్వీట్స్‌తో సహా! మా ఇంట్లో కొంతమందిని 'మీరు గరిటెతో పుట్టారేంటే?' అంటూ ఉంటాను. వాళ్ళు వంటల స్పెషలిస్ట్‌లు.

చింతపండు పచ్చడి మా బామ్మ మా రెండో పిన్నికి నేర్పిస్తే ఆవిడ నాకు ఆ రహస్యం షేర్ చేసింది. అది ఒక్కటీ వేడి అన్నంలో కలుపుకుని నెయ్యి వేసుకుని తింటే, ఇంకేం అక్కర్లేదు. ఇంక మా ఆయన స్పెషాలిటీ చెప్పాలి కదా. ఆయన ఆవపచ్చడి బాగా చేస్తారు. మొన్న సియాటిల్ వెళ్ళినప్పుడు అస్త్రమానం మా మీద ప్రయోగించి, ముక్కులోంచి రక్తం పడేంత వేడి చేసేట్లు చేసారు.

కాకరకాయ పులుసు నేనూ, కంది పచ్చడి మా అత్తగారూ, సాంబారు మా అమ్మా, ఇడ్లీలు మా వదినా, పులిహోర మా ఆడబడుచూ ఇట్లా పేటెంట్లు తీసేసుకున్నాం. ఇంకొకరు చేస్తే ఏదో తేడా వచ్చేస్తుంది.

వరుసగా వారం పదిరోజులు బయట ఊళ్ళలో హోటల్ తిండి తిని, ఇంటికొచ్చి పప్పుచారూ, గోంగూర పచ్చడి వేసుకుని తింటే గుడిపాటి వెంకటా చలంగారు అన్నట్లు "ఆకలేసిన వాడి ముక్కుకి జవ్వాది సువాసనలు కాదు పప్పు చారు ఘుమఘుమలు కావాలి" అనిపిస్తుంది.

Post your comments





